12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 337 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శనివారం 10 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 337 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 10 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## తమిళనాడులో టీవీకే ప్రభంజనం.. రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో అధికార టీవీకే పార్టీ ప్రభంజన సృష్టించింది. సీఎం విజయ్ పాలనకు రెఫరెండంగా భావించిన ఉపఎన్నికల్లో ధారాపురం, మధురాం తకం స్థానాలను గెలుచుకుంది.

- మిగతా 2లో

## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!



పెన్ పవర్ డెస్క్:అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని

- మిగతా 2లో



## రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

- మిగతా 2లో





# ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

### వైసీపీ పిటిషన్ కొట్టివేత

- ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్
- వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని కోర్టు
- పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజనతో ఎన్నికలు ఆలస్యం చేయొద్దని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది.ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది.

- మిగతా 2లో








## ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

పెన్ పవర్ డెస్క్:సర్ ప్రక్రియలో అక్రమాలతో ఓట్ చోరీ చేశారని, చీఫ్ ఎలక్షన్ కమిషర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన క్రమంలో సెంట్రల్ ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు పోలీసులు. (శుక్రవారం) రాత్రం 10 నుంచి సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా మెట్రో స్టేషన్ల మూసివేతతోపాటు

- మిగతా 2లో

## యువతను ఎవరూ ఆపలేరు

### ఢిల్లీ ఆంక్షలపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు



- భారత యువతను ఎవరూ అడ్డుకోలేరన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్
- ఢిల్లీలో సీజేపీ నిరసన నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై కఠిన ఆంక్షలు
- రాజధానిలో 23,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- మెట్రో సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో



## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు

పెన్ పవర్ డెస్క్:విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయను న్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల

- మిగతా 2లో



## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

- మంత్రి లోకేశ్‌తో యువ చెస్ క్రీడాకారిణి నిహారిక భేటీ
- ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించినందుకు అభినందనలు
- ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ కావడమే తన లక్ష్యమని వెల్లడించిన నిహారిక
- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ హామీ

- మిగతా 2లో

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు



పెన్ పవర్ డెస్క్: ఎస్ఐఆర్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండీ కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతితో

- మిగతా 2లో

## దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!



పెన్ పవర్ డెస్క్:నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు తాను అర్హుడనని.. అది తనకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాకు చెందిన నవనీతమ్ పిళ్లైకు

- మిగతా 2లో



## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

### విచారణకు కమిటీ

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

- మిగతా 2లో




# ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా? బలమైన ఎల్ నినో ఇదేనట

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎల్‌నినో వేగంగా బలపడుతోంది. దీనివల్ల చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఈ వాతావరణం ఇలాగే కొనసాగడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని వివరించింది. దీంతో 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా ఇది నిలిచిపోయే అవకాశం ఉందని వివరించింది.

**కాంక్రీట్ జంగిల్ గా ...**

కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న ప్రపంచంతో పాటు, అడవుల నరికివేతతో వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది తీవ్రం చేస్తుందని తెలిపింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో.. ఎల్‌నినోకు కేంద్ర బిందువుగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో.. సాధారణం కన్నా 3.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరగొచ్చని పేర్కొంది.

**వేడి తీవ్రత ఎక్కువయి...**

ఈ పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తంచేశారు. నానాటికీ తీవ్రమవుతున్న ఎల్‌నినో వల్ల పసిఫిక్ మహా సముద్రంలో నిక్షిప్తమైన ఉష్ణం బయటకు విడుదలవుతుందని తెలిపారు. దీనివల్ల భూమి పై చాలా భాగం తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతుందని పేర్కొన్నారు. శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్‌నినో సాగుతుందని ని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. .ఎల్‌నినో వల్ల జూన్–సెప్టెంబరు మధ్య భారత్‌లో దీర్ఘకాల సరాసరి వర్షపాతంతో పోలిస్తే 87.4 శాతం మేర మాత్రమే వానలు పడ్డాయి. ఈ ప్రభావంతో దేశంలో పర్యావరణంపై ప్రభావం పడుతుంది. కరవు, అసాధారణ వేడి పరిస్థితులకు ఆస్కారం పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

భేటీ అనంతరం ఇండీ కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, ప్రియాంకగాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. "ఓటు చోరీకి సంబంధించి రాష్ట్రపతికి వివరించాం. ఓట్ల చోరీ ఎక్కడెక్కడ జరిగిందో రాష్ట్రపతి ఆధారాలు అడిగారు. వాటిని అందజేశాం. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు జరపాలని కోరాం. ఓట్ల చోరీ జరుగుతోందని దేశం మొత్తానికి తెలుసు. సీఈసీ కార్యాలయం నుంచే అన్ని చోరీలు జరుగుతున్నాయి." అని రాహుల్ గాంధీ

# విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మొదటి పేజి తరువాయి

పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు.సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

# రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంద్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్–2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దొనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (–7.93%), రవాణా శాఖ పన్నులు (–7.32%), రీ–సర్వే (–7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని

మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది.గత కొంత కాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు.ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

# మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి, ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ చల్లా నిహారిక రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను సాధించిన నిహారికను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ భేటీలో నిహారిక సాధించిన విజయాలను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిహారిక ప్రతిభ, పట్టుదల భవిష్యత్తులో ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా తన భవిష్యత్ లక్ష్యాలను నిహారిక మంత్రికి వివరించింది. ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించడమే తన తదుపరి లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది. ఆమె ఆకాంక్షలను విన్న మంత్రి లోకేశ్, లక్ష్యసాధనలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శిక్షణ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడానికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన పునరుద్ఘాటించారు.

# అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!

- మొదటి పేజి తరువాయి

ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు.ఈ ఘటన నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌లో ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించామని వెల్లడించారు.అర్ధరాత్రి వేళ రోడ్లపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని సజ్జనార్ హెచ్చరించారు. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్ల మధ్యకు రావడం ప్రమాదకరమన్నారు. పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఇంట్లో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు.ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించడంపై ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, వేడుకల కోసం అక్కడికి వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నా, మళ్లీ అర్ధరాత్రి వేడుకలకు వస్తుండటంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. క్షణకాలపు ఆనందం కోసం విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, ఇకపై ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలు నిర్వహించవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

- మొదటి పేజి తరువాయి

ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 10న సీజేపీ, విద్యార్థి సంఘాల నిరసనలకు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిరసనల్లో రూల్స్ ఉల్లంఘించినందుకు తాజా నిరసనలకు అనుమతి నిరాకరించారు.ముందస్తు చర్యల్లో భాగంగా మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ సేవల నిలిపివేత, భారీ బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు.

మరోవైపు ఢిల్లీలోని 57 మెట్రోస్టేషన్లను మూసివేస్న?నట్లు ఐవీ=జ ప్రకటించింది. పోలీసుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రినుంచే సెంట్రల్ ఢిల్లీలోని మెట్రో స్టేషన్లలో రాకపోకలను

నిలిపివేస్తున్నట్లు తెలిపింది. న్యూఢిల్లీ జిల్లాలోని జంతర్ మంతర్ తో పాటు ఇతర కీలక ప్రాంతాల్లో నిరసనల్లో పాల్గొనేందుకు నిరసన కారులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని గుర్తించిన మెట్రో స్టేషన్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు DMRC ని కోరారు.

# యువతను ఎవరూ ఆపలేరు

రైళ్లను రద్దు చేయడం ద్వారానో, రవాణా మార్గాలను నిలిపివేయడం ద్వారానో దేశ యువతను ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై విధించిన ఆంక్షలపై ఆయన ఈ విధంగా స్పందించారు. శుక్రవారం కుండ్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం చిరాగ్ పాశ్వాన్ విలేకరులతో మాట్లాడారు. "వీరు భారత యువత, వీరిని ఎవరూ ఆపలేరు. ఎన్ని రైళ్లను ఆపగలరు? రవాణా సౌకర్యాలను ఎంతవరకు నిలిపివేయగలరు? ఎన్ని రోడ్లను దిగ్బంధించగలరు? ప్రపంచానికే దిశానిర్దేశం చేసే సత్తా భారత యువతకు ఉంది. అటువంటి పరిస్థితుల్లో వారిని ఎవరూ అడ్డుకోలేరు" అని ఆయన వ్యాఖ్యానించారు.సీజేపీ నిరసన కారణంగా న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు శనివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రావాల్సిన, వెళ్లాల్సిన పలు రైళ్లను భారతీయ రైల్వే రద్దు చేయడంతో పాటు మరికొన్నింటి షెడ్యూళ్లను మార్చింది. ఈ నిరసన నేపథ్యంలో రాజధానిలో 23,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని ఒక ఇనుప కోటలా మార్చేశారు.గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా నిర్వాహకులు చట్టపరమైన ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని పేర్కొంటూ, ఢిల్లీ పోలీసులు ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా, 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ప్రతిపాదించారు. పోలీసుల ప్రతిపాదన మేరకు, శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణలను నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) తొలుత ప్రకటించింది.అయితే, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. శనివారం నాటి నిరసనను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను పూర్తిగా నిలిపివేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన నియంత్రణలతో మెట్రో, ఇతర రైల్వే సేవలు కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై ట్రంప్ పరోక్షంగా స్పందించారు. ఆయనకు మద్దతుగా ఓ సీనియర్ న్యాయవాది ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టును రీపోస్టు చేసిన ఆయన.. నోబెల్ శాంతి దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు."అమెరికా, ఇజ్రాయెల్‌ను బహిరంగంగా ద్వేషించే వ్యక్తి నవనీతమ్ పిళ్లై. శాంతిని పెంపొందించడానికి ఆమె ఎన్నడూ ప్రయత్నించలేదు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి.. ఇరాన్‌ను అడ్డుకోవడానికి ట్రంప్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గాజాను పునర్నిర్మించడానికి కృషి చేస్తున్నారు. అసాధ్యం అనుకున్న అబ్రహం ఒప్పందాన్ని అందించారు. ఇప్పుడు దాన్ని విస్తరిస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతికి ఇలాంటి విషయాలను గుర్తించాల్సింది" అని అమెరికాకు చెందిన సీనియర్ అటార్నీ డేవిడ్ షోయెన్ పెట్టిన పోస్టుపై ట్రంప్ స్పందించారు.

# తమిళనాడులో టీవీకే ప్రభంజనం..

## రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ

- మొదటి పేజి తరువాయి

2026 అక్టోబర్ 9న జరిగిన కౌంటింగ్ లో ముందునుంచీ టీవీకే అభ్యర్థులు లీడ్ లో కొనసాగుతూ చివరికి విజయం సాధించారు. ధారాపురం నియోజకర్గంలో టీవీకే అభ్యర్థి సత్యభామ గెలుపొందారు. మొత్తం 23 రౌండ్ల కౌంటింగ్ తర్వాత సత్యభామ 9 వేల 471 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆమెకు మొత్తం 66 వేల 841 ఓట్లు వచ్చాయి. అంటే 37.02 శాతం ఓట్లతో గెలుపొందారు. ఇక డీఎంకే 57 వేల 370 ( 31.78%) ఓట్లతో రెండో స్థానంలో నిలవగా.. అన్నాడీఎంకే 45 వేల 280 ( 25.08%) ఓట్లు సాధించింది. ధారాపురంలో జనరల్ ఎలక్షన్లలో 40 వేల ఓట్లతో ఓడిన టీవీకే.. ఇప్పుడు దాదాపు పదివేల ఓట్ల తేడాతో గెలుపొందటం గమనార్హం. ఇక మధురాంతకంలో 19 వేల 241 ఓట్లతో టీవీకే అభ్యర్థి మరగతం కుమారవేల్ విజయాన్ని అందుకున్నారు. దీంతో పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచుతూ పార్టీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు.ఇక తమ పాలనకు రెఫరెండంగా భావించి ఉపఎన్నికలకు వెళ్లిన టీవీకే.. తమ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని.. ప్రజలు సంతృప్తిగా ఉన్నారని భావిస్తోంది. పార్టీ గెలుపుతో కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## సిమెంట్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టిన పంచాయితీ అధికారులు....

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 09;** అక్టోబర్ 6 మంగళవారం 'అధికారులు మా రోడ్డు వైపు ఒక్కసారి చూడండి మహా ప్రభు' అన్న పెన్ పవర్ వార్తకు అధికారులు స్పందించారు. పాత పంచాయతీ ఆఫీస్ వెనక ఉన్న మొదటి సిమెంటు రోడ్డును, తాత్కాలిక మరమ్మతులు శు క్రవారం చేపట్టారు. రెండవ సిమెంటు రోడ్డు పని ఎప్పుడు ప్రారంభిస్తారు అని ప్రశ్నించగా? శనివారం, ఆదివారాల్లో పూర్తి చేస్తామని పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ అడ్డతీగల ఎంపీడీవో ఏవివి కుమార్ బదులిచ్చారు. ఇబ్బందికరంగా మారిన రోడ్డును అధికారులు మరమ్మతులు చేపట్టడంతో ఆ ప్రాంతవాసులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాలయాపన చేయకుండా రెండవ సిమెంట్ రోడ్డు కూడా అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని, ఆ ప్రాంతవాసులు అధికారులకు విన్నవించుకుంటున్నారు.




## డిస్ట్రిక్ట్ 316 జి లయన్స్ పింక్ ఫ్రైడే. కేన్సర్ అవగాహన కార్యక్రమం.

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 09.**కేన్సర్‌పై అవగాహన కల్పించడానికి మరియు రోగులకు మానసిక స్థైర్యాన్ని ఇవ్వడానికి ఈ "పింక్ ఫ్రైడే" ఒక సామాజిక బాధ్యతగా ఉపయోగపడుతుందని తరలి కేఫ్ అధినేత లయన్ రెడ్డి లక్ష్మి ప్రసన్న అన్నారు.తాడేపల్లిగూడెం డైమండ్స్ వనిత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రీజయన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు సౌజన్యం తో పింక్ ఫ్రైడే కేన్సర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు గైనకాలజిస్ట్ లయన్ డాక్టర్ సూరపు రమాదేవి మాట్లాడుతూ ముందస్తు గుర్తింపు (ఎర్లీ డిటెక్షన్.:రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. దీనిపై మహిళలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం వనిత లయన్స్ క్లబ్. ముఖ్యలక్ష్యంఅన్నారు లయన్ డాక్టర్ నూకల దుర్గ మాట్లాడుతూ లక్షణాలపై రొమ్ములో గడ్డలు, చర్మం రంగు మారడం, లేదా ఇతర మార్పులను గమనించాలని అలానే క్యాన్సర్‌తో పోరాడుతున్న బాధితులకు మరియు ఆ మహమ్మారి నుండి కోలుకున్న విజేతలకు (సర్వైవోర్స్ ) మద్దతుగా నిలవడం. మన బాధ్యత అని అన్నారు పేరిచర్ల ఫౌండేషన్ తరుపున కేన్సర్ రహిత సానిటరీ ప్యాడ్స్ అందించారు. బాలికలతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమం లో అడ్మిన్ లయన్ ఇంద్ర వాణి మహిళా ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి. మాధవి. లక్ష్మి లలిత ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా కూటమి నాయకులు

**బాధిత కుటుంబానికి 20,000 ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసలు అందజేత.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 09.**తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, భారత ప్రభుత్వ భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ , ఎన్డీఏ కూటమి నాయకులు ముందుకు వచ్చారు. బాధిత కుటుంబానికి ?20,000 ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు (కిరాణా సామగ్రి) అందజేసి, వారికి అండగా నిలిచారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే ప్రజాసేవకు నిజమైన నిదర్శనం.



## తాడేపల్లిగూడెం రైల్వే సదుపాయాల అభివృద్ధికి వినతిపత్రం అందజేత



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 09.**విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం)ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కలిసి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ రైల్వే సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్ల హాల్టింగ్ కల్పించాలని కోరారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రజలకు ముఖ్యమైన రవాణా కేంద్రంగా తాడేపల్లిగూడెం ఉండటంతో పాటు, నిట్ ఆంధ్రప్రదేశ్, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ మరియు వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల రాకపోకలకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో కీలకమైనది.విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు మరియు పశ్చిమ గోదావరి జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రైళ్ల హాల్టింగ్ సదుపాయాలు కల్పించాలని, ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచాలని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు.తాడేపల్లిగూడెంను పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు, విద్యార్థులకు మరింత ఉపయోగకరమైన రైల్వే ప్రయాణ కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ వినతిపత్రాన్ని అందజేశారు.



## ఇస్రో వారోత్సవాల్లో జిల్లా ప్రథమ స్థానంలో శ్రీ విద్య స్కూల్ విద్యార్థులు-కరస్పాండెంట్ దుర్గా ప్రసాద్



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 09:-** అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల అద్భుత విజయాలు సాధించారు.
రాజమండ్రిలో అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీలలో శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన జి. రాజి, వై. హర్షిత, ఎం. తనూజ తమ ప్రతిభను చాటుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ప్రాజెక్ట్ ప్రదర్శనలో జి. రాజి, వై. హర్షిత జిల్లా ప్రథమ స్థానం సాధించి అద్భుత ప్రతిభను కనబరిచారు. ఇస్రో ఎలక్యూషన్ జూనియర్ విభాగంలో ఎమ్. తనూజా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు ఇస్రో శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈసందర్భంగా శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎస్. రామ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలో విశేష కృషి చేస్తున్న శాస్త్రవేత్తల చేతుల మీదుగా పురస్కారాలు అందుకోవడం విద్య స్కూల్ విద్యార్థులకు మరపురాని అనుభూతన్నారు. ఈ విజయం వారిలో శాస్త్ర సాంకేతిక రంగాలపై మరింత ఆసక్తిని, ఉన్నత లక్ష్యాలను సాధించాలనే స్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. ఈ విజయాలు విద్యార్థుల నిరంతర కృషికి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి, పాఠశాల ప్రోత్సాహానికి నిదర్శనమన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రతిభకు తగిన గుర్తింపు లభించడంతో పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

## కైలాస భూమి నుంచి ఇసుక రవాణా అడ్డుకున్న యంత్రాంగం

**ముడుపులు మత్తులో జోగుతున్న సీతానగరం యంత్రాంగాన్ని తట్టి లేపిన జిల్లా అధికారులు**

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ :9:**సీతానగరం మండలంలో గత కొంతకాలంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా పై ఎట్టకేలకు అధికారులు కొరడా ఝుళిపించారు. సీతానగరం కైలాస భూమి రేవు నుంచి అనుమతి లేకుండా సాగిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై " కూటమి కట్టిన ఇసుక తోడేళ్లు" అనే శీర్షికన ఈనెల 8వ తేదీన పెన్ పవర్ పత్రిక తీసుకొచ్చిన ప్రత్యేక కథనంపై జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. పగలు రాత్రి తేడా లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా పలు ప్రాంతాలకు అక్రమార్కులు తరలించడం, ఈ ప్రాంతం ప్రజాప్రతినిధులు వారికి కొమ్ము కాయడంతో అడ్డు అదుపు లేకుండా పోయింది. దీంతో పెన్ పవర్ తీసుకొచ్చిన కథనంపై రెవెన్యూ యంత్రాంగం శుక్రవారం ఉదయం నుంచి కైలాస భూమిని వద్ద బందోబస్తు నిర్వహించింది. అప్పటికే ఇసుక కోసం ఉన్న ట్రాక్టర్లను సిబ్బంది బయటకు పంపించేశారు. గనులు, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుంటే ఇసుక తీసుకెళ్లేలా నిబంధనలు ఉన్నాయని సిబ్బంది చెప్పారు. గత కొద్ది రోజులుగా ఇసుక ట్రాక్టర్లతో రద్దీగా మారిన కైలాస భూమి ప్రాంతం శుక్రవారం నుంచి నిర్మానుష్యంగా మారిపోయింది. కొన్నిచోట్ల ఇసుక ట్రాక్టర్ ద్వారా బయటికి తీసుకొచ్చి అక్కడ నుంచి లారీల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేయటం నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటివరకు ఇసుక రవాణాలో ముడుపుల మత్తులో జోగుతున్న సీతానగరం యంత్రాంగాన్ని జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని లేపడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## బీసీలను ద్రోహం చేస్తున్న చంద్రబాబు కు బీసీలు గుణపాఠం చెప్పాలి

**మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ విమర్శలు**

**రాష్ట్రంలో చంద్రబాబు బీసీలను మోసగిస్తున్నారని వారు గ్రహిస్తున్నారని మాజీ మంత్రి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు**

చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. స్థానిక బొమ్మూరు పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు వెళ్తానని చంద్రబాబు చేస్తున్న మోసాన్ని సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు వలే ఉందన్నారు .సుప్రీంకోర్టు తీర్పు కాదని రిజర్వేషన్లు చంద్రబాబు ఏం రకంగా కల్పిస్తారో చెప్పాలన్నారు.
15 ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోతాయనే ఉద్దేశంతో గతంలో వైఎస్ జగన్ అప్పటివరకు ఉన్న రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం జారీచేసిన105, 106, జీవోలు చెల్లవని హైకోర్టు కొట్టేసిందని, మళ్లీ దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లడం బీసీలను మోసగించడమేనన్నారు.బీసీలను బీసీల తోనే పొడిపించాలని భావించారన్నారు .చంద్రబాబు ప్రభుత్వం చేయించిన కుటుంబ సమగ్ర సర్వే ప్రకారం రిజర్వేషన్లు బీసిలకు కల్పిస్తానంటే చెల్లదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు.తెలుగుదేశం పార్టీ కి అండగా నిలిచిన బీసీ వర్గాలనే చంద్రబాబు మోసగించారన్నారు.ప్రధాని, అమిత్ షా లను ఢిల్లీలో కలసి బీసీల రిజర్వేషన్ గురించి ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. గతంలో అమరావతికి చట్టబద్ధత తెచ్చానని, పదేపదే చెప్పారని, బీసీ రిజర్వేషన్ల లో ఎందుకు చేయలేకపోయారన్నారు.బీసీ రిజర్వేషన్ల వ్యవహారం చెల్లదని తెలిసి జీవోలు ఇచ్చి, పాలాభిషేకాలు చేయించుకున్నారన్నారు.
బిర్రు ప్రతాప్ రెడ్డితో వేయించిన పిల్ వల్ల నష్టపోయింది బీసీలేనన్నారు. 34 శాతం రిజర్వేషన్లు కల్పించి పార్టీ పరంగా ఇస్తామని ప్రకటించారని, వైఎస్ఆర్ సీపీ ఎప్పుడో ఈ రిజర్వేషన్లను పార్టీ పరంగా అమలు చేసిందన్నారు.
రిజర్వేషన్ చట్టబద్ధంగా కావాలే తప్ప పార్టీ పరంగా ఇచ్చేవి కావన్నారు. పవన్ కళ్యాణ్ అండ చూసుకునే బీసీలను వెన్నుపోటు పొడిచారన్నారు .34శాతం రిజర్వేషన్లతోటే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే బీసీ ద్రోహి గానే భావించాల్సి ఉంటుందన్నారు .



## సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తాం రాజకీయంగా బీసీలకు న్యాయం



✷ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే రాజకీయంగా బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బిసి ల రాజకీయ ప్రాధాన్యత, గౌరవం తగ్గకుండా తగిన చర్యలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. హైకోర్టులో న్యాయపర సమస్యలు ఎదురైన నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రయత్నిం. చిందని, సుప్రీంకోర్టును ఆశ్రయించిందన్నారు. హైకోర్టులో వాదనలు వినిపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో ఎందుకు అప్పీల్ చేయలేదని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల సుమారు 16,800 మంది బీసీలకు రాజకీయ అవకాశాలు దూరమయ్యాయని ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి చారిత్రక పాత్ర ఉందన్నారు . ఎన్టీఆర్ హయాం నుంచి చంద్రబాబు నాయుడు నాయకత్వం వరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, రాజకీయ అవకాశాలు కల్పించామని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని, బీసీలకు రాజకీయంగా మేలు చేసే నిర్ణయాలకు అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. గతంలో రిజర్వేషన్లు తగ్గించినప్పుడు వైసీపీ బీసీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. బీసీలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ముందుకు వస్తుంటే విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. చట్టపరమైన చర్యలతో పాటు, పార్టీ పరంగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా కృషి చేస్తుందని వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బీసీలు ఐక్యతను చాటుతూ తమ రాజకీయ బలాన్ని నిరూపించు కోవాలని పిలుపునిచ్చారు. బీసీల హక్కులు, రాజకీయ సాధికారత కోసం కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ కృషి కొనసాగిస్తాయని ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# డిజిటల్ విధానంలో ఎరువుల విక్రయం రైతులకు ప్రయోజనకరం




- ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌తో ముందస్తు బుకింగ్‌కు అవకాశం
- వ్యవసాయ సిబ్బంది, ఎరువుల డీలర్లకు శిక్షణ

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 9:**రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా, సులభంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ డిజిటల్ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పోలవరం జిల్లా వ్యవసాయాధికారి రామ్మోహన్ రావు తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులు తమ పంటలకు అవసరమైన ఎరువులను ముందుగానే నమోదు చేసుకొని, డిజిటల్ పద్ధతిలో బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.సోమవారం రంపచోడవరంలోని కృషి విజ్ఞాన కేంద్రం సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, గ్రామీణ వ్యవసాయ సహాయకులు, ఎరువుల విక్రయదారులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగం, రైతుల నమోదు, ఎరువుల ముందస్తు బుకింగ్ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, రైతులు తమకు అవసరమైన ఎరువులను సులభంగా పొందేందుకు ఈ డిజిటల్ విధానం దోహదపడుతుందని వివరించారు.

**ఆధార్‌తో భూములు, పంటల వివరాల నమోదు**

రైతులు తమ సెల్‌ఫోన్లలోని ప్లే స్టోర్ నుంచి ఫార్మర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఆధార్ ఆధారంగా భూములు, సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫార్సులు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ ఎరువుల సిఫార్సులకు అనుగుణంగా పంటలకు అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

అనంతరం తమకు అవసరమైన ఎరువులను ఎంపిక చేసుకొని, యాప్‌లో క్యూఆర్ కోడ్ ఆధారంగా ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ పూర్తయిన తర్వాత లభించే క్యూఆర్ కోడ్‌ను ఎంపిక చేసుకున్న అధీకృత ఎరువుల డీలర్‌కు చూపించి ఎరువులను కొనుగోలు చేయవచ్చని వివరించారు. ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించి, డిజిటల్ సేవలను సమర్థంగా వినియోగించుకునేలా వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

**సిబ్బందికి సమగ్ర అవగాహన**

శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా ఏడీఏ కంకిపాటి సావిత్రి, మండల వ్యవసాయాధికారులు సీహెచ్ శ్రీనివాస్, అశోక్ పాల్గొని ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగం, అమలు విధానం, రైతులకు అందించే సేవలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లాలోని 12 మండలాల వ్యవసాయాధికారులు, రంపచోడవరం, అడ్డతీగల వ్యవసాయ ఉపవిభాగాల సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయశాఖ సిబ్బంది, జిల్లాలోని ఎరువుల దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

# రూరల్ లో జల్ జీవన్ మిషన్ రూ. 194 కోట్లతో రక్షిత తాగునీటి పథకం

**ఇంటింటికీ గోదావరి శుద్ధ జలాలు : ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:** రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం తోపాటు మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం బొమ్మూరు వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, సబ్ కలెక్టర్ శుభం నోక్వల్ లతో కలిసి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో సుమారు రూ. 2,200 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా 'అమరజీవి జలధార' పథకం కింద రూ. 194 కోట్లతో గోదావరి రక్షిత తాగునీటి పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకం ద్వారా రూరల్ పరిధిలోని 22,376 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు.

ధవళేశ్వరం వద్ద ఇన్‌టేక్ పాయింట్ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి, పైపులైన్లు, ఎత్తైన నీటి నిల్వ ట్యాంకుల ద్వారా గ్రామాలకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. ఏడాది లో పనులు పూర్తి చేస్తామన్నారు.నియోజకవర్గంలో ఇప్పటికే 10 కొత్త నీటి ట్యాంకులను నిర్మించగా, మరో 23 ట్యాంకులను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 22 ఎంఎల్‌డీ నీటి పథకం పూర్తిస్థాయిలో పనిచేయడం లేదని, అదనంగా 14 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేయడం ద్వారా మొత్తం 36 ఎంఎల్‌డీ సామర్థ్యంతో సుమారు 3.60 లక్షల మందికి తాగునీరు అందించే కృషి చేస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రూ. 80 లక్షల రుడా నిధులతో, పేపర్ మిల్లు సహకారంతో పనులు చేపట్టినట్లు వివరించారు. ధవళేశ్వరం చంచల్ కోలో నిర్మాణంలో ఉన్న సంపుల పనులను వేగవంతం చేయాలని అధికారులనుఆదేశించారు.

**రూ. 40 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి**

రూరల్ మండలంలోని గ్రామాలను కార్పొరేషన్ పరిధిలో విలీనం చేసే క్రమంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. 16వ డివిజన్‌లోని ఈశ్వరాలయం రోడ్డు, వెంకటేశ్వర రోడ్డు, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సుమారు రూ. రూ.40 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రహదారుల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

రూరల్ పరిధిలోని సుమారు 11 గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం కానున్నాయని, ఆయా ప్రాంతాల్లో పట్టణ స్థాయి మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. బొమ్మూరు చెరువు చుట్టూ నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, చెరువును అభివృద్ధి చేసి సుందరీకరిస్థామన్నారు. గతంలో నిర్మించిన సుమారు 6,200 టిట్కో గృహాలకు ఉచిత తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉందని తెలిపారు.రాబోయే రెండున్నరేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలకు చేరువగా ఉండేలా స్థానిక ప్రజాప్రతినిధుల వ్యవస్థ బలోపేతం కావాలన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడానికి ఎన్డీఏ కూటమి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

రూ.194 కోట్లతో అమలు చేయనున్న 'అమరజీవి జలధార' పథకం సాంకేతిక అంశాలను ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బి.వి. గిరి వివరించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆర్మ్‌స్ట్రాంగ్, మచ్చెటి ప్రసాద్, మార్ని వాసు, బి.నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల నిరసనకు దళిత సంక్షేమ సంఘం సంఘీభావం





**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 9:**కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన శాంతియుత నిరసన శిబిరం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళిత కుటుంబ సంక్షేమ సంఘం నాయకులు నిరసన శిబిరాన్ని సందర్శించి, ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు మాట్లాడుతూ. గత 20 నుంచి 30 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, గత ప్రభుత్వం నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ, ఏజెన్సీ ప్రాంతంలో సంభవించిన వరదల సమయంలోనూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రభుత్వానికి అండగా నిలిచి ప్రజలకు వైద్య సేవలు అందించామని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. సక్రమమైన వేతనాలు లేక, చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమ సేవలను గుర్తించి ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని పేర్కొన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అవసరమైతే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంఘ నాయకులతో చర్చించి, ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించి న్యాయం చేసే వరకు ఉద్యోగులకు తమ సంఘం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం నిరసన శిబిరంలో ఉన్న ఉద్యోగులకు సంఘం తరఫున 150 వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేసి తమ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మెల్లం నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి ఇంటి సుదర్శన్ కుమార్, కమిటీ సభ్యులు పత్రా జీవరత్నం, కట్టా శ్రీనివాసరావు, గంట్ల కిరణ్, గంగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జాంపేటలో ఆక్రమణల తొలగింపు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:**రానున్న పుష్కరాలకు ట్రాఫిక్ సమస్యల నివారణకు జాంపేటలో రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. నడక మార్గాలపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలను జేసీబీలతో తొలగించడంతో ఆయా రోడ్లు విశాలంగా మారాయి. రహదారుల మార్జిన్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయడం వల్ల ట్రాఫిక్ సమస్యతోపాటు రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. ఫుట్ పాత్ లపై బడ్డీలు ఏర్పాటు చేయడం తోపాటు రోడ్డుపైనే వ్యాపార సామాగ్రిని ఉంచడంతో ఆ రోడ్డులో వాహనాలు ఎదురెదురు వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు నడవడానికి కూడా వీల్లేకుండా పోతుంద న్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నడక మార్గాలను స్పష్టంగా గుర్తించి, వాటిపై ఎటువంటి ఆక్రమణలు లేకుండా చూసేందుకు నిరంతర నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల సన్నద్ధతలో భాగంగా ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని ప్రజలు, వ్యాపారులు సహకరించా లని కోరారు.

# గోవిందగిరి ఆలయానికి చేరిన తిరుమల లడ్డూ ప్రసాదం



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ అక్టోబర్ 9:**రెండవ శనివారం సందర్భంగా గోవిందగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్ర లడ్డూ ప్రసాదం చేరుకుంది. రంపచోడవరం మండలం ఐ.పోలవరం పరిధిలోని గోవిందగిరిలో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులకు ఈ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచినట్లు ఆలయ తనిఖీ అధికారి అంచూరి శిరీష తెలిపారు.శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని, తిరుమల లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించాలని ఆమె కోరారు. రెండవ శనివారం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు ఉచిత రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు

- మానవత సంస్థ ఆధ్వర్యంలో 300 మందికి పరీక్షలు




**పెన్ పవర్ ఉంగుటూరు, అక్టోబర్ 09:**నారాయణపురం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు మానవత సంస్థ ఉంగుటూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, రక్తవర్గ వివరాలతో కూడిన గుర్తింపు పత్రాలను ఉచితంగా అందజేశారు. రక్తదానం ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ శిబిరాన్ని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వసుధ ప్రారంభించారు. చేబ్రోలుకు చెందిన స్వాతి ప్రయోగశాల నిర్వాహకులు ఎం. చిరంజీవి, వారి సిబ్బంది విద్యార్థులకు రక్తవర్గ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సేవలందించారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.వి. శ్రీనివాస్, మానవత ప్రాంతీయ అధ్యక్షుడు పుప్పాల గోపీ, ఉంగుటూరు మండల అధ్యక్షుడు దొంతల విజయ్‌కుమార్, కార్యదర్శి రాజాని సతీష్, కోశాధికారి గంజి రవి, మానవత సీనియర్ నాయకులు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, బొమ్మిడి అప్పారావు, శీతాల సత్యనారాయణ, మంద జయలక్ష్మి, పుత్సకాయల విష్ణుమూర్తి తదితరులు పాల్గొని సేవలందించారు.

# బ్రెయిన్ డెడ్ అయిన సుధీర్ అవయవదానం ఆదర్శనీయం

- కుటుంబ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:**క్లిష్ట పరిస్థితుల్లో బ్రెయిన్ డెడ్‌కు గురైన కొవ్వూరుకు చెందిన అడపా సుధీర్ అవయవదానంతో నలుగురికి పునర్జన్మ ప్రసాదించారు. స్థానిక బొల్లినేని ఆసుపత్రిలో ఈ ఘటన స్ఫూర్తిగా నిలిచింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వచ్చి సుధీర్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సుధీర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషాద సమయంలో అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యుల సేవా దృక్పథాన్ని అభినందించారు. అవయవదానంపై సమాజంలో ఉన్న అపోహలు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. అవయవదానం చేయాలనే సంకల్పం కలిగి ఉన్న సుధీర్ నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు గౌరవించి అమలు చేయడం అభినంద నీయమన్నారు. సుధీర్ అవయవాలలో ఒకరికి కాలేయం, మరొకరికి ఊపిరితిత్తులు , ఆయన కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి , ఒక కిడ్నీని స్థానిక వ్యక్తికి అందించగా, మరో కిడ్నీని విశాఖ పట్నానికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలకు అవయవాలను వేగంగా తరలించేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి సహకరించిన పోలీసు శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరఫున రూ.లక్ష ఆర్థిక సాయం అందించడంతో పాటు, ఈ క్లిష్ట సమయంలో బొల్లినేని ఆసుపత్రి యాజమాన్యం సహకారం అభినందనీయమన్నారు. సుధీర్ భౌతికంగా లేకపోయినా, ఆయన అవయవాల దానం ద్వారా పలువురి జీవితాల్లో జీవించే ఉంటారన్నారు. ఆయన సేవాస్ఫూర్తి అవయవదానంపై సమాజంలో అవగాహన కలిగించాలని ఆకాంక్షించారు.

# వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలకు ఈనెల 14 వరకు గడువు

**సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి**



**రాజమహేంద్రవరం పెన్ పవర్, అక్టోబర్ 9:** నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా విలీనమైన 11 గ్రామ పంచాయతీలకు సంబంధించి డివిజన్ల పునర్విజనపై నోటిఫికేషన్ విడుదలైననేపథ్యంలో డీలిమిటేషన్ ప్రతిపాదనలను ప్రజల పరిశీలనార్థం నగరపాలక సంస్థ, ఆయా పంచాయతీ, తహసీల్దార్, రెవిన్యూ డివిజన్ కార్యాలయాలలో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, డీలిమిటేషన్ ప్రతిపాద నలపై అభ్యంతరాలు లేదా సూచనలు లిఖితపూర్వకంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈనెల 14వ తేదీ లోపు తెలపాలని కోరారు. అభ్యంతర పత్రంలో పేరు, పూర్తి చిరునామా, సంప్రదింపు వివరాలు, ఫోన్ నెంబర్, సంబంధిత వార్డు/ప్రాంతం, అభ్యంతరానికి గల కారణాలు స్పష్టంగా పేర్కొని, సంబంధిత ఆధారిత పత్రాలను జతచేయవలసిందిగా పేర్కొన్నారు. 16న తుది నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ గెజిట్లో ప్రచురిస్తారని తెలియజేశారు.

## 16వ డివిజన్‌లో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 9:** నగరంలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులు, మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచే పనులకు ప్రాధాన్యం ఇస్తున్న మన్నారు. పుష్కరాల నిధులతో మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. శ్రీ వెంకటేశ్వర జనరల్ మార్కెట్ నుంచి 100 అడుగుల రోడ్డుకు అనుసంధానంగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.200 లక్షలు, బాలాజీపేట జంక్షన్ నుంచి హుకుంపేట జంక్షన్ వరకు డీఐ పైపులైన్ నిర్మాణం, హుకుంపేట జంక్షన్ నుంచి ఆదర్శ నగర్ క్రాస్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.308 లక్షలు, బాలాజీపేట జంక్షన్ నుంచి ఆదర్శ నగర్ పార్కు క్రాస్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.169 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. ఈ మూడు పనులకు కలిపి రూ.6.77 కోట్ల వ్యయం కానుందన్నారు. ఈస్ట్ కెనాల్ రహదారి అభివృద్ధి, సుందరీకరణ పనులకు చర్యలు తీసుకుంటున్నారు. ఆక్రమణల తొలగింపు, అర్హులైన నిర్వాసితులకు టీడీఆర్ బాండ్ల మంజూరు, డ్రెయిన్లపై స్లాబుల ఏర్పాటు, భూ వివాదాల పరిష్కారంపై అధికారులు దృష్టి సారిస్తున్నా రన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఎస్.ఈ రిట, డి.ఈ లోవరాజు, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, మార్ని వాసు, దాలిపర్తి వేమన, చప్ప చిన్నారావు, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, ఎంఎంఎల్ రాజు, శీలం గోవిందు, రొంపిచర్ల అంటోనీ, కొయ్యన కుమారి, పిల్ల తనుజ, ఆళ్ల ఆనందరావు, కక్కల రమేష్, ఆదిమూలం సాయి, జ్యోతి, అనంతలక్ష్మి, వార్డు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లవరం జిల్లా పరిషత్ హై స్కూల్ సందర్శించిన డీఈవో శ్రీరామ్ మూర్తి ...



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్09;** అడ్డతీగల మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరియైన ప్రణాళికతో మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొల్పే విధంగా కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మూర్తి తెలిపారు. శుక్రవారం అడ్డతీగల మండలంలోని ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా శు క్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ మార్చి ప్రోగ్రామ్ ను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని, రాబోయే పబ్లిక్ పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుల సూచనలు ప్రకారం సిలబస్ ను పూర్తి చేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించాలని డిఇఓ శ్రీరామ్ మూర్తి అన్నారు. అనంతరం పాఠశాలలో వసతులు పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం మెనూ ప్రకారం ఉంటుందా, లేదా అన్న విషయం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు 100% ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఉన్నత విలువలతో కూడిన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. పాఠశాలలో వాయిదా పడిన ఎస్ఎంసి ఎన్నికలను రాజకీయాలకు అతీతంగా తల్లిదండ్రుల సమక్షంలో వెంటనే నిర్వహించి, కమిటీలను కొలువుదీరేలా చూడాలని డీఈవో సూచించారు. పాఠశాల యొక్క పరిస్థితులను ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు రోలు పల్లి .వెంకటేశ్వర్లు విద్యాశాఖ అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ తో పాటు ఏ ఎం ఓ ఈశ్వరరావు, సీఎం ఓ చిన్ని బాబు దొర ఇతర ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం





- కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం.. కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి
- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, అక్టోబర్ 9:** ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అందిన ప్రతి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. శుక్రవారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆమె స్వయంగా విన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణానికి సంబంధించి వచ్చిన వినతులను పరిశీలించిన ఎమ్మెల్యే, ఇంజనీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి, సాధ్యమైనంత త్వరగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగా స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు.అనంతరం ఏపీఐఐసీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కూటమి కార్యకర్తల సమావేశంలో శిరీషాదేవి మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమానికి తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి అవసరమని, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, సాధ్యమైనంత మేరకు సహాయ చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. తంటికొండ పంచాయతీ పరిధిలోనూ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పన కేశవ్, తెదేపా నాయకులు గణజాల తాతారావు, సావిత్రి, ఊట చిన్నబాబు, బంగారు లచ్చబాబు, పల్లి పెద్దబ్బాయి, బంగారు కూసరాజు, గవిరెడ్డి వీరబాబు, రుతుల అప్పలనాయుడు, ఉగ్గిన నానాజీ, దేశిక శివ, ఇళ్ల గోపాల్‌రెడ్డి, నల్లబెల్లి అర్జున్, విసంశెట్టి రమణతో పాటు ఐదు గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడ్డతీగల జనసేన నాయకుడు పొడుగు. సాయికి కీలక బాధ్యతలు..



**అడ్డతీగల, పెన్ పవర్,అక్టోబర్ 09;** జనసేన పార్టీ అరకు పార్లమెంట్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ నూతన కమిటీ సభ్యుడిగా ,పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండలానికి చెందిన జనసేన నాయకుడు పొడుగు. సాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు కృషి చేస్తూ పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనకు ముందుకు సాగాలని జనసేన సీనియర్ నాయకులు కుప్పాల. జయరాం ఆకాంక్షించారు. అడ్డతీగల మండలం తరపున పొడుగు .సాయి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన ఐటీడీఏ పీవో నరేంద్ర పడాల్

### గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఐటీడీఏ పీవో



**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 9:** నేలకోట గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని సమారిటన్స్ ఫర్ ది నేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ పునరుద్ధరించింది. పునరుద్ధరించిన పాఠశాల భవనాన్ని శు క్రవారం చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నరేంద్ర పడాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వంతో పాటు సమారిటన్స్ ఫర్ ది నేషన్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.

**గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణమే లక్ష్యం**

సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పి. రామ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. నేలకోట ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి పునరుద్ధరణ చేపట్టామని వివరించారు. ఈ పాఠశాలలో 38 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో భవనాన్ని పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని రామ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య అధికారి డాక్టర్ నీల్ వాసు, వైద్య సిబ్బంది, గూడూరు, కొత్తపల్లి గ్రామపంచాయతీల కార్యదర్శులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. భూపతి తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 11కు ఉప ముఖ్యమంత్రి పర్యటన వాయిదా



- ఏర్పాట్లలో లోటుపాట్లు తక్షణమే సరిదిద్దాలి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:** పరిపాలనా కారణాల దృష్ట్యా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పోలవరం జిల్లా పర్యటనను అక్టోబర్ 11వ తేదీ ఆదివారానికి వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పర్యటన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అక్టోబర్ 8న క్షేత్రస్థాయిలో పరిశీలించిన సమయంలో కొన్ని లోపాలు గుర్తించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పర్యటన వాయిదాతో లభించిన అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, గుర్తించిన లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో వేదికల ఏర్పాటు, రహదారుల పరిస్థితి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏర్పాట్ల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన మౌలిక సదుపాయాలను సకాలంలో సమకూర్చుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేసి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదాలనివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజాలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి సూచించారు.

శుక్రవారం నగరం లోని జిల్లా రవాణా కార్యాలయంలో మోటారు వాహనాల చట్టం--1988, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అతి వేగంతో వాహనాలు నడపడం ప్రమాదకరమని, నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని ఆమె సూచించారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చునన్నారు. మోటారు వాహనాల చట్టం--1988లోని నిబంధనలను వివరించి, బాధ్యతాయుత డ్రైవింగ్ ఆవశ్యకతను తెలియజేశారు.అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా రవాణా కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నందం గనిరాజు జంక్షన్, అనల వెంకట అప్పారావు రోడ్డు మీదుగా లాలాచె రువు వరకు వెళ్లి, తిరిగి జిల్లా రవాణా కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ కుమార్, రవాణా శాఖ అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ లీగల్ డిఫెన్స్ కౌన్సెల్స్, పారా లీగల్ వాలంటీర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల భద్రతపై పోలీస్ యంత్రాంగం పూర్తి అప్రమత్తం-ఎస్పీ డి.నరసింహ కిషోర్





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 9:**రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశించారు. శుక్రవారం రాజమహేంద్రవరం వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఆయన, అధికారులతో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట నిఘా, ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని, గొడవలకు పాల్పడే అవకాశం ఉన్నవారిపై బైండోవర్ చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్లను తక్షణమే అమలు చేయాలని అన్నారు. ఎన్నికల వేళ తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులను ప్రచారం చేసేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డులు, ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంచుకోవాలని, స్థానిక ప్రజలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతరం సమాచారాన్ని సేకరించాలని, శాంతిభద్రతలకు సంబంధించిన పరిణామాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని అన్నారు. మునుపటి ఎన్నికల కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సిబ్బంది అంతా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అసిస్టెంట్ ఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్.మురళి కృష్ణ, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వి.అప్పారావు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఈ.పవన్ కుమార్ రెడ్డి, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఏ.శ్రీనివాసు రావు, పోలీస్ స్టేషన్ ఎస్సై లు, క్ సిబ్బంది పాల్గొన్నారు.

## కముజువారిపాలెంలో భవానీల కోలాహలం

**నాలుగు వీధుల్లో అమ్మవారి ఊరేగింపు.. భక్తి విన్యాసాలతో ఆకట్టుకున్న మాలధారులు**





**కొత్తపేట, పెన్ పవర్,అక్టోబర్ 9:**బిళ్లకుర్రు గ్రామ పరిధిలోని కముజువారిపాలెంలో శ్రీ భవానీ మాలధారులు భక్తిశ్రద్ధలతో సందడి చేశారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది భవానీ మాలధారులు అమ్మవారిని నాలుగు వీధుల్లో ఊరేగిస్తూ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. భవానీ మాత, శ్రీ దుర్గామాత మహిమలను వివరిస్తూ భక్తితో చేసిన విన్యాసాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. భక్తుల జయజయధ్వానాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భవానీ మాలధారణలోని పవిత్రత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని వివరిస్తూ భక్తులు అమ్మవారి నామస్మరణ చేశారు. దుర్గామాత అనుగ్రహం పొందేందుకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం, నియమనిష్ఠలతో మాలధారణ చేపట్టడం విశిష్టమైన సంప్రదాయమని తెలియజేశారు. భక్తి, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, దైవచింతన భవానీ దీక్షలో ప్రధానమని వివరించారు.అమ్మవారిని వీధుల్లో ఊరేగిస్తూ భక్తులు ప్రదర్శించిన విన్యాసాలు, భక్తి గీతాలు, నినాదాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు, మహిళలు, గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. భవానీ మాలధారుల కోలాహలంతో కముజువారిపాలెంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల ఆధ్యాత్మిక సందడి గ్రామంలో భక్తిపరవశాన్ని నింపింది.

## కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల ధర్నాకు మాల మహానాడు మద్దతు





- కరోనా సమయంలో వారి సేవలు మరువలేనివి
- డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 9:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారానికి ఐదో రోజుకు చేరుకుంది. కాకినాడ ధర్నా చౌక్‌లో కొనసాగుతున్న ఈ దీక్షకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మద్దతు ప్రకటించి,నిరసన చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ కరోనా మహమ్మారి సమయంలో కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.ప్రాణాలకు సైతం తెగించి, ఎన్నో ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూ బాధితులకు వైద్య సేవలు అందించారని కొనియాడారు.విపత్కర పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేసిన వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని రత్నాకర్ కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.తమ నిరసన దీక్షకు మద్దతు తెలిపిన డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్‌కు కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

## సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం

**కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ..**

**శుక్లం శస్త్రచికిత్సలు ఉచితం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 9:**రామకృష్ణ మిషన్, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ తెలిపారు.ఈ శిబిరంలో సాధారణ అనారోగ్య సమస్యలతో పాటు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించనున్నారు. వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నారు. శుక్లం సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు స్వామీజీ వెల్లడించారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. గిరిజన ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు పొందేందుకు ఈ శిబిరం మంచి అవకాశమని, అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ కోరారు.

## ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్ల తాడేపల్లిగూడెంలో హాల్ట్‌లు కల్పించాలి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 09.**పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ వాణిజ్య, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక మరియు విద్యా కేంద్రమైన తాడేపల్లిగూడెంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్‌కు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు రవి అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక వినతిపత్రం అందజేశారు.తాడేపల్లిగూడెం పట్టణం ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలను కలిగి ఉండి, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ప్రధాన కేంద్రంగా విలసిల్లుతోందని లేఖలో పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఈ స్టేషన్ అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అనేక కీలకమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ నిలపకపోవడం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, రైతులు మరియు వ్యాపారులు దూర ప్రాంతాల స్టేషన్లైన విజయవాడ, ఏలూరు లేదా రాజమండ్రికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపేజీలు: పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్ల తాడేపల్లిగూడెంలో హాల్ట్‌లు కల్పించాలి. వందే భారత్ రైలు నిలుపుదల: ఈ మార్గంలో వెళ్లే కనీసం ఒక వందే భారత్ లేదా ఇతర ప్రీమియం రైలుకు ఇక్కడ స్టాపేజీ మంజూరు చేయాలి.స్టేషన్ దక్షిణ వైపు అభివృద్ధి: పట్టణ దక్షిణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్ మరియు అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలి. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద వంతెనలు: శివాలయం వద్ద ఉన్న ఎల్.సి నెం. 373 మరియు జువ్వలపాలెం, కొంచపల్లి వద్ద ఉన్న ఎల్.సి నెం. 374 మూసివేత వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల రాకపోకల కోసం వంతెనలు లేదా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా, రైల్వే అధికారులు ఈ సమస్యలను అత్యవసర ప్రాతిపదికన పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రవి అగర్వాల్ విజ్ఞప్తి చేశారు.

## అథ్లెటిక్స్‌లో గుల్లేలి చంద్రశేఖర్ నాయుడుకు బంగారు పతకం

**జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక**




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 9:** కర్నూలు జిల్లాలో నిర్వహించిన 41వ ఆంధ్ర రాష్ట్ర అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థి గుల్లేలి చంద్రశేఖర్ నాయుడు బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు కర్నూలు జిల్లాలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-16 విభాగంలో చంద్రశేఖర్ నాయుడు షాట్‌పుట్ పోటీలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో అక్టోబర్ 23 నుంచి 26వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.ప్రస్తుతం 11వ తరగతి చదువుతున్న చంద్రశేఖర్ నాయుడు సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ రమణరావు,పిఈటి అరుణ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని అభినందించి, జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తోటి విద్యార్థులు సైతం చంద్రశేఖర్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు.







**చదువుతో పాటు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి: డాక్టర్ డి. సునీత ప్రిన్సిపాల్**

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 9**: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో నూతనంగా ప్రవేశించిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కళాశాలలో చేరిన నూతన విద్యార్థులు కళాశాలలో ఉండే ఆధునిక పరికరాలు , విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుతో పాటు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఫ్రెషర్స్ డే వేడుకలు సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు కళాశాల వాతావరణానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువస్తాయని అన్నారు. ఈ రోజు మీరు వినియోగిస్తున్న పరికరాలు మరియు వసతులు పి.యం ఉష లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటు చేసినవని వాటిని జాగ్రత్త గా వినియోగించుకొని భావి తరాలవారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. బి. వీరభద్రరావు డైరెక్టర్ యం వి ఆర్ ఫిజిక్స్ అకాడెమీ కాకినాడ, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వాన్ని అలవరచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, క్రమశిక్షణతో కూడుకున్న శ్రమ జీవితాలను ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని చెప్పడంలో అతిశయోక్తి లేదని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారంగా కుర్చీలు, సోఫాలు కొనుగోలు చేసేందుకు రూ.50,000 విరాళాన్ని డా. బి. వీరభద్రరావు అందజేశారు. కళాశాల అవసరాల కోసం ఆయన అందించిన ఈ సహకారం పట్ల ప్రిన్సిపాల్ డా. డి. సునీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీ కె వేంకటేశ్వర రావు, అధ్యాపకులు డా. ప్రయాగ మూర్తి ప్రగడ , వి రామ రావు , ప్రవీణ్ కుమార్ , ప్రసన్న కుమారి డా. మదీనా, డా. శివ ప్రసాద్, శ్రీ లక్ష్మి, డా. బంగారాజు, మేరీ రోజలీనా, పుష్పా, సతీశ్, నాగసత్యవేణి , యేసు, అధ్యాపకేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# సీట్ల సర్దుబాటు ఎలా




**విజయవాడ, అక్టోబరు 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు–పవన్‌ల భేటీలు,పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాతజనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లోజనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగావైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి–ఫామ్‌రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగామార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములనుశాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చుని వైఎస్సార్‌సీపీఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది.పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు–పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయశ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకుసంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

# ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ, అక్టోబరు 9, పెన్ పవర్:** ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేతరామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్‌అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీలస్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంతసంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికిసమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార–ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ ( కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిదిఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజికవర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ–వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంతమేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లనుచీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్తపార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధులనిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్కశాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

# 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి అక్టోబరు 9, పెన్ పవర్:** ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్దతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలికకాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటినిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానికపదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహానిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపర మైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైనవెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనేనిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి–ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు.మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరపున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించేవెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలంవెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లుతీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీటికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

**నెల్లూరు, అక్టోబరు 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసినపిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహంనడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన +.వా.వీం.చీశీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించినప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైనపరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టుఅడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీఅధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలనిచూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరినాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయపరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021–26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణస్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల "పే కమిషన్ నిధులు"ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతంకోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణస్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడాఇవ్వనున్నాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీరిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది?కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

## అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలిచిన మంత్రి కొల్లు

**మచిలీపట్నం పెన్ పవర్:** మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్ధాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్యవైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదనికలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

## రఘురామకు స్థానిక సంస్థల ఎన్నికల సెగ తగిలే ఛాన్స్ ఉందా?




ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సెగ తగిలే అవకాశముంది. ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఆయన బలపర్చిన అభ్యర్థులకు కూటమిలోని నేతలే ప్రశ్నించే అవకాశాలున్నాయి. కూటమి పార్టీల ఓట్ల బదిలీపై కూడా అనుమానం తలెత్తుతుంది. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయాలపై వివిధ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి కావడంతో, రఘురామ కృష్ణరాజు సొంత నియోజకవర్గమైన ఉండిలో పార్టీని గెలిపించుకోవడం ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత అనేక వివాదాలకు కేంద్రంగా మారారు. అదే సమయంలో సొంత పార్టీ నేతలను కూడా దూరం చేసుకున్నారు. అదే సమయంలో కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా రఘురామ కృష్ణరాజు ను సమర్థించేవాళ్లు తక్కువగా ఉన్నారు.

**టిక్కెట్ల కేటాయింపు నుంచి...**

ఉండి నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతల మధ్య స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపులో సయోధ్య కుదర్చడం రఘురామకృష్ణరాజుకు అత్యంత కీలకమైన అంశం. స్థానిక నేతల ఆశలు, అసంతృప్తులను సమన్వయం చేసుకోకపోతే అంతర్గత పోరు తగిలే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 34 శాతం బీసీ రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవలే మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తుది నిర్ణయం ఆధారంగా మరికొద్దిరోజుల్లోనే టికి ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ రిజర్వేషన్ల రొటేషన్ ప్రక్రియలో స్థానిక సమీకరణాలను బట్టి అభ్యర్థులను ఖరారు చేయడం స్థానిక ఎమ్మెల్యేగా రఘురామ కృష్ణరాజుకు ఒక పరీక్ష వంటిదే. గత ఎన్నికల్లో చివరి నిమిషంలో ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ ను రఘురామ కృష్ణరాజు పొందగలిగారు.

**వైసీపీ కొంత కసిగానే...**

రఘురామ కృష్ణరాజు వాస్తవానికి పార్లమెంటుకు పోటీ చేయాలని భావించినా అది వీలు కాలేదు. వైసీపీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరదామని భావించి తిరిగి చివరి నిమిషంలో టీడీపీలో చేరి ఉండి టిక్కెట్ దక్కించుకున్నారు. రఘురామ కృష్ణరాజు గౌరవ ప్రదమైన డిప్యూటీ శాసనసభ స్పీకర్ పదవి లభించింది. అయితే ఆయన ఉండి నియోజకవర్గంలో తీసుకున్న పలు నిర్ణయాలు ఇబ్బందికరంగా మారాయి. మరొకవైపు ఆక్వా రైతులు కూడా దెబ్బకొట్టే అవకాశముంది. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా గెలిచి, ఆ తర్వాత ఆ పార్టీతో విభేదించి టీడీపీలో చేరిన రఘురామకృష్ణరాజుపై ఎలాగైనా పైచేయి సాధించాలని ప్రతిపక్ష వైసీపీ వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తోంది. ఉండి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎన్నికల ద్వారా తమ బలాన్ని నిరూపించుకోవాలని ప్రతిపక్షం గట్టిగా ప్రయత్నిస్తోంది.ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ హోదాలో రఘురామకృష్ణరాజు నియోజకవర్గంలో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు, దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్టం చేసుకుంటూ, అసంతృప్తులను చల్లార్చగలిగితే ఎన్నికల సెగను తట్టుకుని ఆయన తన పట్టును నిలుపుకోగలరా? అన్నదే ప్రశ్న. చూడాలి రఘురామ ఈ స్థానిక సంస్థలను ఎలా నెగ్గుకొస్తారో...?

# రాంచీలో భారత బ్యాటర్ల దంచుడు..

# వెస్టిండీస్ ముందు అదిరిపోయే

రాంచీ టీ20లో చెలరేగిన భారత బ్యాటర్లు

వెస్టిండీస్ ముందు 250 పరుగుల కొండంత లక్ష్యం

సంజూ శాంసన్ మెరుపు ఇన్నింగ్స్.. 41 బంతుల్లో 82 పరుగులు

చివర్లో ఆకాశమే హద్దుగా చెలరేగిన శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ

విండీస్ బౌలర్లలో ఒక్క రోస్టన్ చేజ్ మినహా అందరూ విఫలం



వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిపోయారు. రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా బ్యాటర్లు పరుగుల వరద పారించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. సంజూ శాంసన్ (82) అద్భుత అర్ధశతకంతో కదంతొక్కగా, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టు స్కోరును పరుగులు పెట్టించారు. దీంతో వెస్టిండీస్ ముందు 250 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిర్దేశించారు.టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ఇన్నింగ్స్ ఆరంభించిన అభిషేక్ శర్మ (20), సంజూ శాంసన్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో భారత బ్యాటర్లు విండీస్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. కేవలం 3.5 ఓవర్లలోనే జట్టు స్కోరు 42 పరుగులకు చేరిన దశలో అభిషేక్ శర్మ ఔటయ్యాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన స్థానిక హీరో ఇషాన్ కిషన్ (43) రావడంతోనే బ్యాట్ ఝుళిపించాడు. సంజూ, ఇషాన్ జోడి రెండో వికెట్‌కు కేవలం 43 బంతుల్లోనే 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ముఖ్యంగా సంజూ శాంసన్ తనదైన శైలిలో క్లాస్, మాస్ షాట్లతో అలరించాడు. అయితే, అద్భుతంగా బౌలింగ్ చేసిన రోస్టన్ చేజ్.. ఇషాన్ కిషన్, శివమ్ దూబే (7), సంజూ శాంసన్‌లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేర్చి భారత్‌ను కాస్త కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. సంజూ కేవలం 41 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 82 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (40), తిలక్ వర్మ (44లి) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆఖరి ఓవర్లలో ఈ ఇద్దరూ విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించారు. కేవలం 32 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 250 పరుగుల సమీపానికి తీసుకెళ్లారు. శ్రేయస్ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 40 పరుగులు చేసి అవుట్ కాగా, తిలక్ వర్మ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

వెస్టిండీస్ బౌలర్లలో స్పిన్నర్ రోస్టన్ చేజ్ ఒక్కడే ఆకట్టుకున్నాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. మిగతా బౌలర్లంతా భారీగా పరుగులు సమర్పించుకున్నారు. షమార్ స్ప్రింగర్ 4 ఓవర్లలో ఏకంగా 64 పరుగులు ఇచ్చాడు.

# పదేళ్ల తర్వాత టెస్టుల్లోకి.. చెత్త రికార్డుతో నిరాశపరిచిన ఆసీస్ బ్యాటర్

- దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి తిరిగొచ్చిన నిక్ మ్యాడిన్సన్
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఆడి డకౌట్
- టెస్టుల్లో అత్యధిక బంతులు ఆడి డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా చెత్త రికార్డు
- క్యాన్సర్‌ను జయించి పునరాగమనం చేసిన మ్యాడిన్సన్‌కు తీవ్ర నిరాశ
- 2016 తర్వాత మళ్లీ ఇప్పుడే టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఆసీస్ బ్యాటర్



ఆస్ట్రేలియా క్రికెటర్ నిక్ మ్యాడిన్సన్ దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. అయితే, ఈ ఎమోషనల్ కమ్‌బ్యాక్ అతనికి తీవ్ర నిరాశను మిగిల్చింది. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 33 బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండా డకౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఒక చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యన్సెన్ బౌలింగ్‌లో మ్యాడిన్సన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఫలితంగా, టెస్టు క్రికెట్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొని డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు డేవిడ్ వార్నర్ (22 బంతులు) పేరిట ఉండేది. అంతేకాకుండా, 21వ శతాబ్దంలో ఒక టెస్ట్ ఓపెనర్ ఆడిన అత్యంత సుదీర్ఘ డకౌట్ ఇన్నింగ్స్ కూడా ఇదే కావడం గమనార్హం. 34 ఏళ్ల మ్యాడిన్సన్ చివరిసారిగా 2016 డిసెంబర్‌లో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025లో అతనికి వృషణాల క్యాన్సర్ నిర్ధారణ అయింది. కీమోథెరపీ తీసుకుని, వ్యాధిని జయించి మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో రాణించి జట్టులోకి వచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (9) కూడా త్వరగానే ఔటయ్యాడు. క్యాన్సర్‌పై పోరాడి గెలిచి జట్టులోకి వచ్చిన మ్యాడిన్సన్ కథ స్ఫూర్తినిచ్చినా, మైదానంలో అతను నమోదు చేసిన ఈ చెత్త రికార్డు అతని పునరాగమనానికి చేదు జ్ఞాపకంగా మారింది.

# భువనేశ్వర్ రీఎంట్రీ వెనుక అసలు కారణమిదే.. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఆసక్తికర వ్యాఖ్యలు!

- నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్‌కు టీమిండియాలో చోటు
- పునరాగమనానికి అనుభవం, ఐపీఎల్ ప్రదర్శనే కారణమన్న బ్యాటింగ్ కోచ్
- యువ బౌలర్లతో పాటు అనుభవజ్ఞులూ అవసరమన్న సితాన్షు కోటక్
- షమీ ఎంపికపై సెలెక్టర్లదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
- షమీ కూడా బాగా ఆడుతున్నాడని వ్యాఖ్య



టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత టీ20 జట్టులోకి వచ్చాడు. అతడి పునరాగమనానికి ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో పాటు అపార అనుభవం కూడా కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వెల్లడించాడు. యువ బౌలర్లు బాగా రాణిస్తున్నప్పటికీ, కీలక సమయాల్లో అనుభవం కూడా అవసరమని అభిప్రాయపడ్డాడు.భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ తరఫున ఆడాడు. ఆ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన అతడు.. ఐపీఎల్‌లో మాత్రం తన సత్తా చాటాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతూ 2025 సీజన్‌లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 28 వికెట్లు పడగొట్టాడు. రెండు సీజన్లలో కలిపి 45 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ రెండు సీజన్లలో ఆర్‌సీబీ వరుసగా ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది.ఇంగ్లండ్ పర్యటన సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం, యువ బౌలర్లు ఎక్కువగా ఉండటంతో అనుభవజ్ఞుల అవసరం కనిపించిందని కోటక్ చెప్పాడు. యువ ఆటగాళ్లు బాగా ఆడుతూ జట్టులోకి వస్తున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో అనుభవానికి కూడా ప్రాధాన్యం ఉంటుందని వివరించాడు. ఐపీఎల్‌లో భువనేశ్వర్ నిలకడగా రాణించడం కూడా అతడి ఎంపికకు కారణమై ఉండొచ్చని పేర్కొన్నాడు.మరో సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పునరాగమనంపై మాత్రం కోటక్ స్పష్టమైన వ్యాఖ్యలు చేయలేదు. షమీ కూడా మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తున్నాడని, అతడి ప్రదర్శనతో పాటు జట్టు అవసరాలను పరిగణనలోకి తీసుకుని సెలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని చెప్పాడు. తాను సెలెక్టర్‌ను కానందున షమీ ఎంపికపై తుది నిర్ణయం చెప్పలేనని స్పష్టం చేశాడు.వీవీఎస్ లక్ష్మణ్‌ను సెలక్షన్ సమావేశాల్లో భాగం చేయడం, జట్టు యాజమాన్యం నుంచి సెలెక్టర్లకు ఆటగాళ్ల గాయాల సమాచారాన్ని చేరవేసే బాధ్యత అప్పగించారన్న వార్తలపైనా కోటక్ స్పందించాడు. ఈ విషయం తనకు కూడా మీడియా ద్వారానే తెలిసిందని చెప్పాడు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయం వెనుక సరైన కారణం ఉంటుందని భావిస్తున్నానని తెలిపాడు.

# శృతి హాసన్.. పర్సనల్ ఫ్రీడమ్ కు లిమిట్స్ ఎక్కడ?



హీరోయిన్లు తమ పర్సన్ లైఫ్ పై మాట్లాడటం కొత్తేమీ కాదు. కానీ కొన్ని విషయాలపై ఓపెన్ గా మాట్లాడితే మాత్రం వెంటనే డిబేట్ స్టార్ట్ అవుతుంది. ఇప్పుడు స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ చేసిన కామెంట్స్ కూడా అలాంటి చర్చనే మొదలుపెట్టాయి. అయితే ఆమె చేసిన కామెంట్స్ కంటే.. దాని వెనుక ఉన్న ఆలోచన ఏంటనేదే అసలు అబ్జర్వ్ చేయాల్సిన విషయం.

శ్రుతి హాసన్ రీసెంట్ గా సెల్ఫ్ కేర్, పర్సనల్ ఫ్రీడమ్ వంటి విషయాలపై మాట్లాడారు. ఆ సమయంలో సెలిక్స్ టాయ్స్ ను కూడా సెల్ఫ్ కేర్ లో భాగంగా చూడొచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ విషయంలో ఇతరుల పర్మిషన్ అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత నిర్ణయాలను తామే తీసుకునే ఫ్రీడమ్ ఉండాలని చెప్పారు. ఇక్కడ శ్రుతి చెప్పిన అసలు పాయింట్ ఒక వస్తువు గురించి మాత్రమే కాదు.



మన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన నిర్ణయాలపై సొసైటీ ఎంతవరకు ఎఫెక్ట్ చూపించాలనేదే ఆమె కామెంట్స్ లో కనిపిస్తున్న మెయిన్ ఎలిమెంట్. ముఖ్యంగా పర్సనల్ లైక్స్, రిలేషన్స్, బాడీ, ప్రైవసీ వంటి విషయాల్లో ఇతరులు చేసే జడ్మెంట్లకు భయపడకుండా.. తమకు ఏది కంఫర్ట్ గా ఉంటుందో దానిని వ్యక్తులు నిర్ణయించుకోవాలన్నది ఆమె అభిప్రాయంగా కనిపిస్తోంది.అయితే మన సొసైటీలో ఇలాంటి విషయాలు ఇప్పటికీ కామన్ గా మారలేదు. అందుకే శ్రుతి కామెంట్స్ బయటకు వచ్చిన వెంటనే ఆమె చెప్పిన విషయం కంటే.. ఆమె ఎందుకు ఇలా మాట్లాడారనే యాంగిల్ లో ఎక్కువగా చర్చ జరుగుతోంది. కొందరికి ఇది పర్సనల్ ఫ్రీడమ్ గురించి చెప్పిన జస్ట్ ఒపీనియన్ గా కనిపిస్తే.. మరికొందరికి మాత్రం ఇలాంటి విషయాలను బహిరంగంగా మాట్లాడటం అవసరమా అనే ప్రశ్న రావచ్చు.అందుకే శ్రుతి ఒపీనియన్ తప్పా? ఒప్పా? అనే విషయం ఇంట్రెస్టింగ్ గా మారింది. నిజానికి ఆమె కామెంట్స్ ను అందరూ ఒకే విధంగా చూడాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత ఎంపికల విషయంలో ఎవరి అభిప్రాయం వారిదే. అయితే పర్సన్ ఫ్రీడమ్ అంటే బాధ్యత కూడా ఉండాలనే విషయం కూడా అంతే ముఖ్యమైనది. ఏ వ్యక్తిగత నిర్ణయమైనా అది తనకు, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ఉండటం అవసరం.



మరోవైపు సెల్ఫ్ కేర్ అనే పదానికి కూడా అర్థం మారుతుంది. గతంలో ఇది హెల్త్, రెస్ట్, పీస్ ఫుల్ నెస్ వంటి విషయాలకే ఎక్కువగా పరిమితమయ్యేది. ఇప్పుడు పర్సనల్ కంఫర్ట్, ప్రైవసీ, ఎమోషనల్ నీడ్స్ అవసరాలు కూడా ఇందులో భాగంగా చర్చకు వస్తున్నాయి. శ్రుతి కామెంట్స్ ను కూడా మారుతున్న థింకింగ్ ప్రాసెస్ లో చూడొచ్చు.

అందుకే ఆమె మాటలను కేవలం బోలిల్డ్ కామెంట్స్ గా చూడటం కంటే.. పర్సనల్ ఫ్రీడమ్, ప్రైవసీ, సామాజిక తీర్పులపై ఆమె చెప్పిన అభిప్రాయంగా చూడటం బెటర్. అయితే యాక్సెప్ట్ చేయాలా లేక వ్యతరేకించాలా అనేది ఎవరి వ్యక్తిగత ఆలోచన వారిదే. కానీ సాధారణంగా మాట్లాడటానికి ఇబ్బంది పడే అంశంపై శ్రుతి మరోసారి తన అభిప్రాయాన్ని క్లియర్ గా చెప్పారని అనడంలో డౌట్ అక్కర్లేదు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965